సాక్షి నంద్యాల

I

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



'చెత్త'గించరూ!

స్వచ్ఛాంధ్ర అనే పాలకులు పారిశుద్ధ్య పనులను మరిచారు. కర్నూలులో గత గురువారం 'సూపర్ జీఎస్టీ' సభ నిర్వహించగా వ్యర్థాలు పోగుపడ్డాయి. ఇప్పటి వరకు తొలగించలేదు. IIలో▸



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన నటరాజ అకాడమీ వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.50
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.243
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:5,183
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,202

న్యూస్‌రీల్

మల్లన్న సన్నిధిలో భక్తులు చల్లన



అమ్మవారి ఆలయం వద్ద టెంజైన్ ఫ్యాబ్రికేషన్

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా స్వామివారి దర్శనం అనంతరం బయటికి వచ్చిన తరువాత మల్లికాగుండం నుంచి అమ్మవారి ఆలయం వరకు రూ.60లక్షల నిధులతో టెంజైన్ ఫ్యాబ్రికేషన్ చేశారు. భక్తులు నడిచేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశంలో గతంలో రేకులు ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడేవారు. రేకులను తొలగించి టెంజైన్ ఫ్యాబ్రికేషన్ ఏర్పాటు చేశారు. దీంతో ఎండకు , వానకు ఇబ్బందులు లేకుండా భక్తులకు చల్లగా ఉంటుంది. అలాగే కోతుల బెడద కూడా లేకుండా ఉంటుంది. శివరాత్రి, ఉగాది ఉత్సవాల్లో సైతం అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేసే అవసరం ఉండదు.

వీబీఆర్‌లో 16 టీఎంసీల నీరు

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (వీబీఆర్)లో 16.443 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలుగోడు జలాశయానికి తెలుగుగంగ కాల్వ ద్వారా 6,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. వీబీఆర్ నుంచి చెన్నై ప్రధాన కాల్వకు 6000, ఎస్ఆర్ తూముకు 60, ఎన్ఎల్ తూముకు 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలోని ఏపీఎస్ ఆర్టీసీ అప్రెంటిషిప్ ఐటీఐ ఉత్తీర్ణులైన నిరుద్యోగులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ కర్నూలు శిక్షణా కళాశాల సిబ్బంది నజీర్ అహమ్మద్ శనివారం తెలిపారు. ఈనెల 25 నుంచి నవంబర్ 8వ తేదీలోపు www.apprenticeshipindian.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో డీజిల్ మెకానిక్ 32, మోటారు మెకానిక్ 4, ఎలక్ట్రీషియన్ 4, వెల్డర్ 1, పెయింటర్ 1, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ 1 చొప్పున ఖాళీగా ఉన్నాయని వారు తెలిపారు. వెరిఫికేషన్ కోసం ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను కర్నూలు శిక్షణ కళాశాలలో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 08518-257025ను సంప్రదించాలన్నారు.

క్లాప్ మిత్రల సంక్షేమంపై దృష్టి సారించండి

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుద్ధ్య పనులు చేపడుతున్న క్లాప్ మిత్రల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసర రెడ్డి కోరారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో జిల్లాలోని ఎంపీడీఓలకు ఎల్ఎస్‌డీజీఎస్ థీమ్ – 5 (క్లీన్ అండ్ గ్రీన్) అనే అంశంపై టీఓటీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ అర్హులైన క్లాప్ మిత్రలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీమా భద్రత, సంక్షేమ పథకాలు, పీఎంఎస్‌బీవై, చంద్రన్న బీమా, ఈ శ్రమ్, ఎన్టీఆర్ భరోసా అందేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ అధిక వినియోగంతో మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతోందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయాల దిశగా అడుగులు వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే వ్యాధులు, జరిగే నష్టాలపై అవగాహన కలిగించాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ మంజులావాణి, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీఓటీలు ఆసఫ్ బాషా, పి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో టీటీడీ క్యాలెండర్లు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానముల పంచాంగం క్యాలెండర్లు, డైరీలు విక్రయానికి అందుబాటులో ఉన్నాయని టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ సి.రామ్మోహన్ తెలిపారు. కర్నూలు సీ.క్యాంప్ టీటీడీ కల్యాణ మండపంలో తగినన్ని క్యాలెండర్లు, డైరీలు విక్రయానికి అందుబాటులో ఉంచామన్నారు. పెద్ద డైరీ రూ.150, చిన్న డైరీ రూ.120, 12 సీట్స్ క్యాలెండర్ రూ.130, తెలుగు పంచాంగం క్యాలెండర్ రూ.30, టేబుల్ క్యాలెండర్ రూ.75, శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటంతో కూడిన క్యాలెండర్ రూ.20, శ్రీ వెంకటేశ్వర స్వామి పద్మావతి అమ్మవారు కలిసి ఉన్న క్యాలెండర్ రూ.15, ఆరుషీట్స్ డిజిటల్ క్యాలెండర్ రూ.450 ధరలతో విక్రయిస్తున్నట్లు తెలిపారు.

సహకారం.. తిరోగమనం!

- పీఏసీఎస్‌ల్లో అడ్డగోలుగా ఉద్యోగుల నియామకం
- ఇష్టానుసారంగా గౌరవ వేతనాల చెల్లింపు
- నిర్వీర్యమైన ప్యాక్స్ డెవలప్‌మెంటు సెల్
- ఉమ్మడి జిల్లాలో 70 సంఘాల్లో నష్టాలు



సి.బెళగల్‌లో నిర్మించిన సహకార సంఘం కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్‌ల్లో) 'కూటమి' పార్టీల నేతల పెత్తనం పెరిగిపోయింది. తమకు అనుకూలమైన వారికి పీఏసీఎస్‌ల్లో ఉద్యోగాలు ఇవ్వాలని అధికారులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. ఇటీవల జిల్లాలోని పీఏసీఎస్‌లకు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఇందులో ఒకరు చైర్మన్, ఇద్దరు సభ్యులుగా ఉంటారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు చేసిన సిఫారస్సులకు అనుగుణంగా త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేశారు. దీనిని అవకాశంగా తీసుకొని సంఘాల్లో అడ్డగోలుగా నియామకాలు జరిగిపోతున్నాయి. సంఘాల్లోని సీఈఓలను డమ్మీలను చేసుకొని చైర్మన్లు జోరుగా నియమకాల ప్రక్రియను నిర్వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'కూటమి'కి పెద్దపీట

ఉమ్మడి జిల్లాలో 99 పీఏసీఎస్‌లు (కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 53) ఉన్నాయి. త్రీమెన్ కమిటీలు ఏర్పాటు కావడమే తరువాయి ఇష్టారాజ్యంగా నియామకాలు చేసుత్నారు. ఆదోని నియోజకవర్గంలో తమ వారిని ఉద్యోగాల్లో నియమించుకునేందుకు ఒకవైపు టీడీపీ ఇన్‌చార్జ్, మరోవైపు బీజేపీ ఎమ్మెల్యే పోటీపడుతున్నారు. సహకార సంఘాల్లో ఎలాంటి నియామకాలు చేపట్టరాదని, ఎక్కడైన అత్యవసరం అనుకుంటే మార్గదర్శకాలకు లోబడి తగిన అనుమతులతో తీసుకోవాలని పీఏసీఎస్‌లకు కర్నూలు, నంద్యాల జిల్లాల సహకార అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ ఆదేశాలను తుంగలో తొక్కి ఆళ్లగడ్డ, ఆదోని, ఆత్మకూరు, పత్తికొండ, బనగానపల్లి నియోజకవర్గాల్లో జోరుగా నియామకాలు చేస్తున్నారు. కూటమి పార్టీల కార్యకర్తలకు పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా పీఏసీఎస్‌ల చైర్మన్లు నెలకు రూ.1200 గౌరవ వేతనం తీసుకునే అవకాశం ఉంది. కాని ఇష్టానుసారంగా తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నారు. కొందరు రూ.3000, మరి కొందరు రూ.5000, ఇంకొందరు రూ.7500 వరకు తీసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వంలో..

ఉమ్మడి జిల్లాలోని 99 పీఏసీఎస్‌ల్లో అత్యధికం నష్టాల్లో కూరకపోయాయి. దాదాపు 70 సంఘాలు నష్టాల్లో మునిగితేలుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే సహకార సంఘాల అభివృద్ధిపై నీలినీడలు అలుముకున్నాయి. జిల్లా సహకార కేంద్రబ్యాంకులోని ప్యాక్స్ డెవలప్‌మెంటు సెల్ నిర్వీర్యమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు పూర్తవుతోంది. ఈ కాలంలో పీఏసీఎస్‌ల అభివృద్ధికి తీసుకున్న చర్య ఒక్కటంటే ఒక్కటీ లేదు. సంఘాల్లో టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఉద్యోగాల పేరుతో కూర్చోబెట్టడానికి ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. అడ్డగోలుగా నియమాకాలు జరుగుతున్న విషయం సహకార అధికారులకు తెలిసినప్పటికీ తమకెందుకులే అనుకొని మిన్నకుండిపోయారు. కర్నూలు జిల్లాలో ఒక సంఘం, నంద్యాల జిల్లాలో ఒక సంఘానికి కుమూరుడు సీఈఓగా, తండ్రి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 39 సంఘాలు నష్టాల్లో కూరకుపోయి ఉన్నాయి. కౌతాళం సహకార సంఘానికి ఏకంగా రూ.8,54,62,750 నష్టం ఉంది. చింతకుంట సహకార సంఘానికి రూ.8,12,28,069, మామిదాలపాడు సహకార సంఘానికి రూ. 2,37,63,416 ప్రకారం నష్టాలు ఉన్నాయి. రూ.కోటికిపైగా నష్టాల్లో అనేక సంఘాలు ఉండిపోయాయి. నష్టాల్లో కూరుకుపోయిన సంఘాలను బయటికి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వంలో ఎలాంటి చర్యలు లేవు.

కొత్తగా నియామకాలు వద్దు

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఎలాంటి నియామకాలు చేపట్టరాదు. 2019లో పీఏసీఎస్‌లకు హెచ్‌ఆర్ పాలసీ వచ్చింది. హెచ్‌ఆర్ పాలసీలో ఉన్న వారే కొనసాగుతారు. సహకార సంఘాల్లో కొత్తగా నియామకాలు చేసుకోవద్దని పీఏసీఎస్‌ల చైర్మన్‌లకు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చాం. పీఏసీఎస్ చైర్మన్‌లు కూడా గౌరవ వేతనం కేవలం రూ.1200 మాత్రమే తీసుకోవాలి. ఎక్కువగా తీసుకుంటే రికవరీ చేయాల్సి ఉంటుంది. సంఘాలను చైర్మన్‌లు పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

– వెంకటకృష్ణ, డీసీఓ, కర్నూలు

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

సహకార సంఘాలను లాభాల బాట పట్టించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. మల్టీపర్పస్ సెంటర్లుగా తీర్చిదిద్దేందుకు పలు చర్యలు తీసుకుంది. ఇందుకోసం జిల్లా సహకార కేంద్రబ్యాంకులో ప్రత్యేకంగా ప్యాక్స్ డెవలప్‌మెంటు సెల్ ఏర్పాటు చేసి ఆప్కాబ్‌లో పనిచేసే సీనియర్ మేనేజర్, ఏజీఎం స్థాయి అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఏఏ సంఘం ఎలాంటి వ్యాపారాల్లో రాణించేందుకు ఆసక్తి చూపుతుందో అందుకు అనుగుణంగా ఈ సెల్ డీపీఆర్‌లు సిద్ధం చేస్తుంది. ఇందుకు అనుగుణంగా డీసీసీబీ, ఆప్కాబ్ సంఘాలకు నిధులు ఇచ్చేది. గత ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలతో సహకార సంఘాలు లాభాల బాట పట్టాయి. సంఘాలకు సొంత భవనాలతో పాటు షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు అయ్యాయి. కొన్ని సంఘాలకు పెట్రోలు పంపులు కేటాయించారు. పలు సంఘాలకు జీవనధార మందుల దుకాణాలు కూడా ఇచ్చారు. బంగారంపై రుణాలు ఇచ్చే ప్రక్రియ మొదలైంది. కొన్ని సంఘాలు బియ్యం వ్యాపారం కూడా చేస్తున్నాయి. సంఘాలకు అనుబంధంగా మల్టీపర్పస్ గోదాములు కూడా నిర్మించారు.



సహకార సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకు

24న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన స్థానిక సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో వ్యవసాయం – అనుబంధ శాఖలు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, మత్స్యశాఖ, దేవదాయ శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్లు, జెడ్పీటీసీ, ఎంపీపీలు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో ముగ్గురు డీఈఈలకు షోకాజ్ నోటీసులు

- ప్రధానమంత్రి కార్యక్రమ విధుల్లో నిర్లక్ష్యమే కారణం

కర్నూలు(అర్బన్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలుకు వచ్చిన సందర్భంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ప్రధాని కార్యక్రమం నిర్వహించిన ప్రదేశంలో వీవీఐపీ, వీఐపీ, ఎంఎస్ఎంఈ, పబ్లిక్ గ్యాలరీల్లో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలకు అధికారికంగా విధులు కేటాయించారు. ఆయా గ్యాలరీల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వీరికి సహాయకులుగా ఏఈ, ఏఈఈ, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, బ్లూ ప్రింట్ ఆపరేటర్లు, ఇతరత్రా కేడర్లకు చెందిన ఉద్యోగులను నియమించారు. ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తదితరులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చాలా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఈ నెల 13వ తేదినే ఫిజికల్ మీటింగ్ కూడా నిర్వహించారు. అయితే కర్నూలు, ఆదోని, నంద్యాల డీఈఈలు తమకు అప్పగించిన విధుల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ మనోహర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విలువైన మెటీరియల్‌ను కర్నూలు ఈఈకి అప్పగించే విషయంలో చాలా అశ్రద్ధ కనబరిచారని, ఆయా మెటీరియల్‌ను ఎక్కడికక్కడే వదిలేసినట్లు నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే వీరు ముగ్గురు డీఈఈలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారికి కేటాయించిన వాహనాలను కూడా సొంత పనులకు వినియోగించుకున్నారని నోటీసులో పేర్కొన్నారు.

22నుంచి శ్రీశైలంలో కార్తీకమాసోత్సవాలు



శ్రీశైల ఆలయం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఈ నెల 22 నుంచి నవంబర్ 21వ తేది వరకు కార్తీకమాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్తీకమాసమంతా భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ పూజావేళలను మార్పులు చేసి వేకువ జామున 4గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.30గంటల నుంచి రాత్రి 10.30గంటల వరకు దర్శనాలు కొనసాగుతాయన్నారు. ప్రతి సోమవారం ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. నవంబర్ 1న కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని కోటి దీపోత్సవ కార్యక్రమం ఏర్పాటవుతుందన్నారు. 5న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణోత్సవం, లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి ఉంటుందన్నారు. కార్తీకమాసమంతా ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చనలు పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

అంతా మీ ఇష్టమేనా?

- సర్పంచ్‌ల డిజిటల్ సిగ్నేచర్లు ఎందుకు ఉంచుకున్నారు?
- అధికారుల పనితీరుపై జెడ్పీ చైర్మన్ ఆగ్రహం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: 'గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శుల డిజిటల్ సిగ్నేచర్లు ఎందుకు డిప్యూటీ ఎంపీడీఓ కార్యాలయంలో ఉంచారు. అంతా మీ ఇష్టానుసారంగా చేస్తారా?' అని అధికారులపై జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన కొలిమిగుండ్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ పనితీరుపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఫిర్యాదు చేయగా జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. గత సమావేశంలో మండలంలో ఎక్కడా పందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారని, ఏం చేశారని డిప్యూటీ ఎంపీడీఓను ప్రశ్నించారు. నాయకుల నుంచి ఒత్తిళ్లు ఉన్నాయని సమాధానం రావడంతో జెడ్పీ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రబీ సీజన్ ప్రారంభమైనా రైతులకు సబ్సిడిపై శనగ విత్తనాలు అందిచరా, యూరియా కూడా ఇవ్వరా' అని వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. కొలిమిగుండ్ల నుంచి పెట్నికోట రోడ్డును నాసిరకంగా వేశారని, పీహెచ్‌సీల్లో సిబ్బంది ఉండటం లేదని సభ్యులు చెప్పగా సమస్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. ఇటిక్యాల, కొలిమిగుండ్ల రెవిన్యూ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు ఇతరత్రా వాటి కోసం స్థలాలు అవసరం అవుతాయని, ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మైనింగ్ సీనరేజ్ వసూలును ప్రైవేట్‌కు అప్పగించకుండా పాత పద్ధతిలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని, ఈ మేరకు తీర్మానం చేసి పంపాలని సూచించారు.

అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్లు మంజూరు



ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.2.50కోట్లు మంజూరైనట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ లడ్డూ కౌంటర్ తయారీ బిల్డింగ్, నాలుగు గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం, నూతన పరిపాలనా కార్యాలయ భవనం, అదనంగా భక్తుల సౌకర్యార్థం 50గదుల నిర్మాణానికి తాజాగా ప్రతిపాదనలు పంపామన్నారు. అన్నదానం కోసం జీప్లస్ బిల్డింగ్ నిర్మాణానికి ఇప్పటికే రూ.2.30కోట్ల నిధులు మంజూరు కాగా రివైజింగ్ కోసం పంపినట్లు వెల్లడించారు. మంజూరైన అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

జీఎస్టీ తుస్.. డిప్ 'ధనా'ధన్!

- టపాసుల అంగళ్ల ఏర్పాటుకు కొత్తగా డిప్ పద్ధతి
- నంద్యాలలో 63 షాపులకు రూ.29.61లక్షల వసూలు



డిప్ తీస్తున్న టపాసు దకాణాల యజమానులు



డిప్ తీసేందుకు చలానాదారుల పడిగాపులు

నంద్యాల(అర్బన్): జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) తగ్గిందని కేంద్ర ప్రభుత్వం ఓ వైపు చెబుతున్నా.. రాష్ట్రంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది టపాసుల అంగళ్ల ఏర్పాటుకు అధిక మొత్తాలను వసూలు చేస్తున్నారు. ఇదంతా దారుణం అని షాపుల యజమానులు వాపోతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం ఇలా..

రెవెన్యూ, పోలీసులు, మున్సిపల్, ఫైర్, విద్యుత్ తదితర శాఖల నుంచి ఎన్ఓసీ(నో అబ్జెక్షన్ సర్టిఫికెట్)తో పాటు రూ.500 చలానా చెల్లిస్తే ఆర్‌డీఓ కార్యాలయంలో డిప్ పద్ధతి ద్వారా టపాసుల స్టాల్స్ ఏర్పాటు చేసుకోవచ్చు అనేది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం. నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ గ్రౌండ్‌లో 63 స్టాల్స్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇందు కోసం ఆర్‌డీఓ కార్యాలయంలో నిర్వహించాల్సిన స్టాల్స్ ఏర్పాటు డిప్ సిస్టమ్‌ను కొన్ని కారణాల వల్ల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఇందు కోసం ఉదయం 10గంటల నుంచి స్టాల్స్ ఏర్పాటుదారులు డిప్ సిస్టమ్ కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ఎట్టకేలకు సాయంత్రం 5.30గంటలకు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులుల ఆధ్వర్యంలో 62 స్టాల్స్ ఏర్పాటుకు డిప్ సిస్టమ్‌ను నిర్వహించారు.

వసూళ్లు ఇలా..

ఎన్ఓసీ సర్టిఫికెట్లు లేక పోవడంతో డిప్ సిస్టమ్‌లో పాల్గొనేందుకు అర్హులు కాదంటూ 21 మందిని కొద్దిసేపు నిలిపి వేశారు. అనంతరం సొంత పూచీకత్తు మీద వారిని డిప్‌లో పాల్గొనాలని సూచించారు. మొత్తం మీద 62 స్టాల్స్ మాత్రం డిప్ ద్వారా నంబర్లు కేటాయించారు. అయితే ఒక్కో షాపుకు రూ.47 వేలు చొప్పున వసూలు చేస్తున్నారని షాపు యజమానులు వాపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.500 చెల్లిస్తే షాపు కేటాయిస్తారని చెబుతున్న ప్రకటనలు పేపర్లకే పరిమితం అయ్యాయని ఆరోపిస్తున్నారు. దాదాపు 63 షాపులకు రూ.29.61లక్షలు అవుతున్న మొత్తం ఎక్కడికి వెళ్తుందని ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ నేత హస్తం

నంద్యాల పట్టణంలోని ఒక టీడీపీ నేత ఈ మొత్తాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. ఇలా సేకరించిన మొత్తాన్ని పలు శాఖలు, ప్రజాప్రతినిధులకు కొంత మొత్తాన్ని కేటాయించి మిగిలిన మొత్తాన్ని స్వాహా చేయనున్నట్లు షాపుల కేటాయింపు పొందిన పలువురు ఆరోపిస్తున్నారు. జీఎస్టీ తగ్గిందని కేంద్ర ప్రభుత్వం ఓ వైపు చెబుతున్నా గత ఏడాది కంటే ఈ ఏడాది షాపుల యజమానులపై ఈ విధంగా అంత మొత్తాలను మోపడం దారుణమని వాపోతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా ఏ షాపు యజమాని అయినా రూ.47వేలు చెల్లిస్తున్నామని ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రూ.500 చలానా చెల్లిస్తే చాలు షాపులు కేటాయిస్తున్నామని, అధిక మొత్తలు వసూలు చేస్తున్నామనడంలో అర్థం లేదన్నారు.

కలం.. నిరసన గళం



నంద్యాల: ప్రజల పక్షాన నిలుస్తూ ప్రభుత్వ అక్రమాలను, వైఫల్యాను ఎండగడుతున్న జర్నలిస్టులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డితో పాటు ఇతర పాత్రికేయులపై నమోదు చేసి అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తప్పుడు కేసులు ఎత్తివేయాలి



'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలు తక్షణమే నిలిపి వేయాలి. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిని పోలీసులు వేధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రభుత్వాలు కాదు. అక్షరం శాశ్వతమన్నది పోలీసులు గుర్తెరగాలి. మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం, పత్రికా ఎడిటర్‌పై తప్పుడు కేసులు నమోదు చేయడం మంచి పద్ధతి కాదు. ఇది ఒక్క సాక్షిపైనే కాదు పత్రికా రంగంపైనే దాడి. పోలీసులను పాత్రికేయులపై ఉసిగొల్పుతున్నారు. జర్నలిస్టు సంఘాలు చూస్తూ ఊరుకోవు.

-పీ.ఎం. లక్ష్మినరసింహం, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

కలానికి సంకెళ్లా?



ప్రజల పక్షాన గొంతుకగా నిలుస్తున్న జర్నలిజానికి సంకెళ్లు వేయాలనుకోవడం అవివేకం. పోలీసులను అడ్డుపెట్టుకొని యథేచ్ఛగా ప్రజల హక్కులు, విలువలను కాలరాయాలనుకోవడం తగదు. నిజాలు చెప్పే మీడియా సంస్థలపై దాడి చేయడం దుర్మార్గపు చర్య. రాష్ట్రాన్ని నకిలీ మద్యం పట్టి పీడిస్తూ అమాయకుల ప్రాణాలు హరిస్తున్నా ప్రభుత్వం చోద్యం చూడటం తగదు. నకిలీ మద్యంపై వార్తలు రాస్తే ఎడిటర్, జర్నలిస్టులపై కేసు నమోదు చేయడంలో అర్థం లేదు. ప్రభుత్వం పునరాలోచన చేయాల్సి ఉంది.

– శివనాగిరెడ్డి, ఏపీ ఎన్‌జీఓస్ ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ అధ్యక్షుడు, నంద్యాల

పత్రికా స్వేచ్ఛపై దాడి హేయం



పత్రికా స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వం దాడులు చేయడం హేయం. సాక్షి ఎడిటర్‌పై, ఇతర జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం మంచి పద్ధతి కాదు. ప్రభుత్వాలను మార్చే శక్తి అక్షరానికి ఉన్నదని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంలా ఉన్న పత్రికా రంగంపై ఇలా దాడులు చేయడం, కేసులు నమోదు చేయడం మంచి పద్ధతి కాదు. జర్నలిస్టులు వారు చూస్తున్న, జరుగుతున్న అన్యాయాలను పత్రికా ముఖంగా వెలుగులోకి తెస్తారు. దీన్ని తప్పుగా భావించి కేసులు పెట్టడం సరికాదు.

– జనార్దన్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు, నంద్యాల

జర్నలిస్టులపై కేసులు సరికాదు



నకిలీ మద్యంపై కథనాలు రాసిన జర్నలిస్టులు నోటీసులు ఇవ్వడం కక్ష సాధింపు చర్యలో భాగమే. స్వేచ్ఛగా జర్నలిస్టులు వార్తలు రాస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుంది. అవినీతి, అక్రమాలను ప్రశ్నించే జర్నలిస్టులకు సంకెళ్లు వేయాలనుకోవడం అవివేకం. అక్రమ మద్యంపై కథనాలు రాసిన జర్నలిస్టులపై కేసులు బనాయించడం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడటమే.

-బోయ పులికొండన్న, ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, నంద్యాల

అధికారులూ.. 'చెత్త'గించరూ!


సభా ప్రాంగణం నిండా చెత్త చెదారం


బహిరంగ సభ చుట్టూ వ్యర్థాలే


పచ్చని పొలాల్లో ఇలా..


గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు


వందల ఎకరాల్లో ఇంతే..

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ అంటూ కూటమి నేతలు కర్నూలు సభలో ఊదరగొట్టారు. సభకు లక్షలాది జనాన్ని బస్సుల్లో తరలించి ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు, మూడు పార్టీల నాయకులు హడావుడి చేశారు. అయితే ప్రజలు సభలో ఏమి తెలుసుకున్నారో ఏమో కానీ.. సభాప్రాంగణం ప్రస్తుతం అంతా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఎటు చూసినా వాటర్ బాటిళ్లు, నీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు, భోజనం పార్సిల్ కవర్లు కనిపిస్తున్నాయి. పది రోజుల క్రితం పచ్చని పైర్లతో కళకళలాడుతున్న పొలాలు నేడు డంప్‌యార్డును తలపిస్తున్నాయి. స్వచ్ఛ భారత్.. స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివాస్ అంటూ చెప్పే పాలకులు, అధికారులు ఈ ప్రాంతాన్ని మాత్రం విస్మరించారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపిద్దామంటూ ప్రతి నెలా మూడో శనివారం కార్యక్రమాలు చేపట్టే అధికారులు ఈ సభా ప్రాంగణం వైపు మాత్రం ఈ రోజు కన్నెత్తి చూడలేదు. వెంటనే వ్యర్థాలను తొలగించాలని ప్రజలు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. – వడ్డె శ్రీనివాసులు, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


కనుచూపు మేరలో ప్లాస్టిక్ వ్యర్థాలు

పంచాయతీ పాలక మండలికి ప్రాథమిక సమాచారం ఇవ్వరా?

- పంచాయతీ భాగస్వామ్యం లేకున్నా బిల్లు పెట్టాలని ఒత్తిడి
- బిల్లులు పాస్ చేయాలంటే రూ. 10 వేలు ఇవ్వాలని డిమాండ్
- సమావేశంలో సర్పంచ్, ఉప సర్పంచ్ ధ్వజం

కోవెలకుంట్ల: ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో గ్రామ పంచాయతీ పాలక మండలికి కనీస సమాచారం ఇవ్వడం లేదని మండలంలోని బిజనవేముల సర్పంచ్ గజ్జెల పక్కీరమ్మ, ఉపసర్పంచ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మూడవ శనివారం కావడంతో గ్రామంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారని అయితే సర్పంచ్, ఉపసర్పంచ్, పాలక మండలికి ప్రాథమిక సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. కోవెలకుంట్ల, ఇతర ప్రాంతాల నుంచి బయటి సిబ్బందిని పిలుచుకుని వచ్చి ర్యాలీ, ఇతర కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరమన్నారు. గ్రామ పంచాయతీ పాలక మండలి భాగస్వామ్యం లేకపోయినా కార్యక్రమ నిర్వహణకు సంబంధించి రూ. 15 వేలు బిల్లు పెట్టేందుకు తీర్మానం ఇవ్వాలని డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు ఒత్తిడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీకి సంబంధించిన పాలక మండలి కావడంతో అధికారులు పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని కోరితే రూ. 10 వేలు కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ప్రజలకు ఉపయోగ పడే పనులు చేస్తుంటే పాలక మండలిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోగా పనులు సరిగా చేయలేదని జిల్లా ఉన్నతాధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ పాలకమండలి, అధికారులు సమష్టిగా పనిచేస్తేనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో నడుస్తాయని వారు వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కృష్ణగిరి: భార్య, భర్తల బంధంలో మరో వ్యక్తి ప్రమేయం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నాం చేసింది. దీంతో చివరకు ఒకరి ఆత్మహత్యకు దారి తీసిన ఘటన మండలంలోని టి.గోకులపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ పూల సూర్యచంద్రుడు (30)కు దేవనకొండ మండలం, మాదార్‌పురం గ్రామానికి చెందిన మహాలక్ష్మితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇతనికి మొదట అమకతాడు గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహం కాగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె అనారోగ్యంతో ఏడేళ్ల క్రితం మృతి చెందగా, రెండో భార్యగా మహాలక్ష్మిని చేసుకున్నాడు. వీరికి అమ్మాయి, అబ్బాయి సంతానం. కాగా.. మహాలక్ష్మి గ్రామంలో తమ బంధువైన సూరిబాబుతో చనువుగా ఉండటాన్ని గమనించి సూర్యచంద్రుడు మందలించాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే మళ్లీ కాపురానికి రావాలని పిలిచినా రాకపోవడంతో రామచంద్రుడు మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్నాడు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. కాగా..చీరతో ఉరేసుకున్నాడా? లేక చంపి ఉరి వేశారా అన్నది తెలియాల్సి ఉందని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి తల్లి బోయ పూల లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

మంత్రాలయం: మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంత్రాలయంలోని రామచంద్ర నగర్‌కు చెందిన బంగి భీమయ్య కుమారుడు రామాంజినేయులు(43) బెల్దారీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఏడాది కాలంగా ఆయన భార్య లక్ష్మి, పిల్లలకు దూరంగా ఉంటున్నారు. దీంతో మానసికంగా కుంగిపోయిన రామాంజినేయులు శుక్రవారం అభయాంజనేయ స్వామి ఆలయ సమీపంలోని పొలంలోని రేకుల షెడ్డులో ఉరి వేసుకున్నాడు. శనివారం పొలానికి వెళ్లిన కూలీలు షెడ్‌లో నుంచి దుర్వాసన వస్తుండటంతో వెళ్లి చూసి పోలీసులకు సమాచారం చేరవేశారు. సాయంత్రం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి కుమారులు మంజునాథ్, ఉదయ్‌కుమార్, కూతురు శిరీష ఉన్నారు.

1 నుంచి కర్నూలు ఉత్సవ్ వేడుకలు

కర్నూలు (కల్చరల్): కర్నూలు ఉత్సవంలో భాగంగా నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే అంశాలను టీజీవీ కళాక్షేత్ర కార్యాధ్యక్షులు పత్తి ఓబులయ్య శనివారం రాత్రి ప్రకటించారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ నాటక అకాడమీ, టీజీవి కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి రోజూ నాటకం, సాహిత్యం, సంగీతం, హార్మోనిస్టులు, నేపథ్య గాయకుల్లో వారు అందించిన సేవలను గుర్తు చేస్తూ పది మందిని సత్కరించనున్నట్లు పే ర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ సందర్భంగా 1వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి టీ జీవీ కళాక్షేత్రం వరకు కర్నూలు నగర ప్రముఖులతో పాటు కళాకారులు, ఇతరులతో భారీ ర్యాలీ నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు.

నవంబర్‌లో గుండ్రేవుల కోసం జలదీక్ష


మాట్లాడుతున్న కేపీఎస్ అధ్యక్షుడు శ్రీహర్ష

కర్నూలు(సెంట్రల్): వెనుకబడిన కర్నూలు జిల్లా స్థితిగతిని మార్చే గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం కోసం నవంబర్ మూడో వారంలో జలదీక్ష చేపట్టాలని మేధావులు, రైతు సంఘాల నాయకులు నిర్ణయించారు. శనివారం బిర్లా కంపౌండ్‌లోని కేపీఎస్ కార్యాలయంలో 'కర్నూలుకు తాగునీరు- రైతులకు సాగునీరు' నినాదంతో గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకతపై కర్నూలు ప్రగతి సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కేపీఎస్ అధ్యక్షుడు శ్రీ హర్ష అధ్యక్షత వహించగా మేధావులు రిటైర్డ్ ప్రిన్సిపాల్ చెన్నయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ మన్సూర్ రెహమాన్, విద్యావేత్త జి.పుల్లయ్య, రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, శేషన్నరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు రవికుమార్, లోక్‌సత్తా నాయకుడు డేవిడ్, వీహెచ్‌పీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, సీపీఎం నాయకులు పుల్లారెడ్డి, ఇతర నాయకులు హరినాథ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ముందుగా గుండ్రేవుల ప్రాజెక్టుకు 20 టీఎంసీలతో డీపీఆర్ రూపొందించిన సుబ్బారాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేపీఎస్ అధ్యక్షుడు శ్రీహర్ష మాట్లాడుతూ.. గుండ్రేవుల ప్రాజెక్టు చేపడితే కర్నూలుకు తాగునీటితోపాటు పశ్చిమ ప్రాంతంలోని పత్తికొండ, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సంపూర్ణంగా సాగునీరు అందిరైతులు బాగుపడతారన్నారు. 40 ఏళ్లుగా ప్రాజెక్టు నిర్మాణాన్ని పాలకులు కుంటిసాకులు చెబుతూ విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో ఎన్నికల కోసం శంకుస్థాపన చేసిన చంద్రబాబునాయుడు..ఇప్పుడు అధికారంలోకి వచ్చినా ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ఈ క్రమంలో ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రజల మద్దతు పోరాటాలు చేయడంలో భాగంగా నవంబర్ మూడో వారంలో జలదీక్ష చేపట్టనున్నట్లు వివరించారు.

ముస్లింల సామూహిక వివాహాలు


సామూహిక వివాహాలు చేస్తున్న గురువులు,


పెళ్లి జంటకు ఇవ్వడానికి సిద్ధంగా ఉంచిన వస్తువులు

ఆదోని సెంట్రల్: పట్టణంలో అబాబెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు చెందిన ఏడు జంటలను గుర్చించి కేకేబీ ఫంక్షన్ హాలులో ముస్లిం మత పెద్దల సమక్షంలో వివాహాలను జరిపించారు. ఈ వివాహాలను జరిపించడానికి ముస్లిం సోదరులు చాలా మంది తమవంతుగా చేయుత నందించారని ఇస్లామిక్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కొందరు వస్తు రూపంలోనూ మరి కొందరు భోజనాలు ఏర్పాట్లు వంటి అవసరమైన ప్రతి వస్తువులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొత్తగా పెళ్లి చేసుకున్న జంటలకు ముస్లిం ఆచారం ప్రకారం వారి ఇంటికి అవసరమైన ప్రతి వస్తువులను దాతలు అందజేశారు.

కష్టమంతా మట్టిపాలు

గిట్టుబాటు ధర లేక లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన ఉల్లి పంటను ఓ రైతు చివరకు ధ్వంసం చేశాడు. కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన రైతు కురువ గిడ్డయ్య వర్షాధారంగా ఐదెకరాల్లో సుమారు మూడున్నర లక్షలకు పైగా పెట్టుబడితో ఉల్లి పంట సాగు చేశాడు. ప్రస్తుతం పంట చేతికి రాగా మార్కెట్‌లో ఉల్లికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లి పంటను కోసి మార్కెట్‌కు తరలించినా కోత కూలీలు కూడా దక్కవని భావించాడు. దీంతో రెక్కల కష్టంతో సాగు చేసిన పంటను శనివారం ట్రాక్టర్, ఎద్దులతో దున్నేసి రబీ సీజన్‌లో శనగ సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నాడు.
– కోడుమూరు రూరల్


వెంకటగిరిలో ట్రాక్టర్‌తో ఉల్లి పంటను దున్నేస్తున్న రైతు


ఉల్లి పంటను ఎద్దులతో దున్నేస్తున్న రైతు

వ్యక్తి ఆత్మహత్య

గోస్పాడు: భార్యాభర్తల మనస్పర్థలతో మనస్తానానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని యాళ్లూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాకలి శ్రీనివాసులు (47), భార్య లక్ష్మీదేవి మధ్య తరచూ మనస్పర్థలు తలెత్తుతుండేవి. ఈ క్రమంలో భార్య గత 5 రోజులుగా పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో పురుగు మందు తాగి గ్రామ సమీపంలోని కాల్వగట్టుపై అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన స్థానికుల సమాచారంతో చికిత్స నిమిత్తం యాళ్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాగ్ అప్పగింత

- ఆటోలో మరిచిపోయిన ప్రయాణికులు
- అందులో 9 తులాల బంగారు


బాధితుడికి నగల బ్యాగ్‌ను అందజేస్తున్న వన్‌టౌన్ పోలీసులు

నంద్యాల: పట్టణంలోని నడిగడ్డకు చెందిన షేక్ రహిమాన్ ఈనెల 17న ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను నంద్యాల వన్‌టౌన్ పోలీసులు బాధితుడికి శనివారం అప్పగించారు. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన మేరకు.. షేక్ రహిమాన్ కుటుంబంతో కలిసి కోవెలకుంట్ల వెళ్లడానికి నడిగడ్డలో ఆటో ఎక్కి ఆర్టీసీ బస్టాండ్ వద్ద దిగారు. దిగే సమయంలో ఆటోలో తన భార్యకు చెందిన హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయారు. అందులో 8 తులాల బంగారు నెక్లెస్, ఒక తులం మాట్టీలు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు క్రైం టీం సభ్యులతో కలిసి బస్టాండ్‌లోని సీసీ టీవీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని కెమెరాలను పరిశీలించి ఆటోను గుర్తించారు. కాగా..విశ్వనగర్‌కు చెందిన మాబుహుసేన్ తన ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌తో బాధితుల కోసం ప్రయత్నించినా లాభం లేకపోయింది. దీంతో బ్యాగ్‌ను పోలీసులకు ఇవ్వాలనుకున్న సమయంలో పోలీసులు వెళ్లి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు.